ప్రజాశక్తి

బుధవారం 14 మే 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







మాట్లాడుతున్న మజుందర్

సమ్మెను జయప్రదం చేద్దాం..

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందర్

ప్రజాశక్తి-చీరాల

లేబర్ కోడ్స్ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చి కార్మికులపై పెత్తనం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, వీటిని తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఐక్యం కావాలని, ఆ దిశగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీనియర్ సిటిజన్ కార్యాలయంలో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం.వసంతరావు, ఎఐటియుసి నాయకులు డి.నాగేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి బత్తుల సామ్యూల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వీటి అమలు కోసం రాష్ట్రాలలో అధికారులకు ట్రైనింగ్ ఇస్తోందన్నారు. మే 20న సమ్మెలో భాగంగా కార్మిక వర్గం రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బోయిన పోతురాజు, చింతా శ్రీనివాసరావు, తిరుమలరావు, క్రాంతి సాగర్, కె పోతురాజు, మేడ వెంకట్రావు పాల్గొన్నారు.



రోదిస్తున్న రమణారెడ్డి కుటుంబసభ్యులు



రోడ్డుప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు

కూలిపోయిన బతుకులు..

- వినుకొండలో బొలెరోను ఢీకొన్న లారీ
- నలుగురు కూలీలు దుర్మరణం
- ముగ్గురికి గాయాలు
- అనాథలుగా మారిన పిల్లలు
- శోకసంద్రంగా గడ్డమీదపల్లి



పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ (ఫైల్) రామాంజి, అంకమ్మ (ఫైల్)

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వ్యవసాయం సాగక.. కూలి పనుల బాట పట్టిన దంపతులిద్దరు.. కూలి పనులే జీవనాధారంగా బతికే భార్యాభర్తలు మరో ఇద్దరు.. ఈ నలుగురినీ మృత్యువు రోడ్డుప్రమాద రూపంలో కబళించింది. వీరినే నమ్ముకొని ఇంటి వద్ద ఉన్న వారి పిల్లలను అనాథలను చేసింది. కూలీలను తీసుకెళ్లే డ్రైవర్ కూడా చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. మరో ఇద్దరు మహిళా కూలీలు కూడా గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఇంతమంది జీవితాలను కబళించిన రోడ్డుప్రమాదం పల్నాడు జిల్లాలోని వినుకొండ మండలం, శివాపురం వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది.

యర్రగొండపాలెం మండలంలోని గడ్డమీదపల్లి గ్రామం నుంచి ఆరుగురు కూలీలు బొలెరో వాహనంలో బొప్పాయి కోత కూలి పనులకు బయలుదేరారు. పల్నాడు జిల్లా, వినుకొండ మండలం, శివాపురం వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కొబ్బరికాయల లారీ బొలెరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో యర్రగొండపాలెం మండలంలోని గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన పగడాల రమణారెడ్డి (45), ఆయన భార్య సుబ్బమ్మ (40)తో పాటు జొన్నగిరి రామాంజి (40), ఆయన భార్య అంకమ్మ (35) మృతిచెందారు. డ్రైవర్ కదిరి నాగేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. ఇతని ▶ 2లో

వైసిపికి జంజనం రాజీనామా

నేడు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ▶ 4లో

లేఅవుట్ల క్రమబద్ధీకరణలో

నిబంధనలు పాటించాల్సిందే..

- అడ్డగోలుగా అనుమతులిచ్చే అధికారులపై కఠినచర్యలు
- కలెక్టర్ వెంకటమురళి



కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

లేఅవుట్ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో బాపట్ల మున్సిపాలిటీ మరియు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్‌లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆరా తీశారు. 2019 నుంచి మున్సిపాలిటీ, బావుడా పరిధిలోని తొమ్మిది మండలాలలో మొత్తం 183 అనధికార లే అవుట్లను గుర్తించి వాటి వివరాలను డిటిసిపికి పంపామని అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అందులో 86 లేఅవుట్లను 22ఎ కింద గుర్తించి రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌కు పంపించామని చెప్పారు. మిగిలిన 97 లేఅవుట్లను సబ్ డివిజన్లుగా చేసి పంపాలని వాటిని తిప్పి పంపారని వారు కలెక్టర్‌కు వివరించారు. 97 లేఅవుట్లకు సంబంధించి సర్వే నెంబర్లు వారీగా ఆయా తహశీల్దార్లతో సబ్‌డివిజన్ చేయించి వాటి వివరాలను బావుడాకు తెలియజేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులను ఆయన ఆదేశించారు. ఆ వివరాలను డిటిసిపికి పంపి వాటిని రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకోవాలని బావుడా ▶ 2లో

రూల్ ఈజ్ రూల్.!

- నిబంధనల ప్రకారమే కలెక్టర్ అన్సారియా నిర్ణయాలు..
- అతిక్రమించిన సిబ్బందిపైనా చర్యలకు వెనకాడని వైనం
- ఇబ్బందికరంగా భావిస్తున్న పాలకపక్ష ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కలెక్టర్ అన్సారియా.. పాలనలో ఎక్కడా నిబంధనలను అతిక్రమించేందుకు సాహసం చేయడం లేదు. ఏదైనా రూల్స్ ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టంగా పాలకపక్ష నేతలకు సంకేతాలు ఇస్తున్నారు. చేయకూడని పనులు చేసి ఏదైనా చర్యలకు గురి కావాల్సి వస్తే ఎవరు కాపాడతారనే భావనలో కలెక్టర్ ఉన్నారు. పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ తప్పులు ఎందుకు చేయాలనే ఆలోచనలో స్పష్టంగా ఉన్నారు. సిఎం చంద్రబాబు కూడా కలెక్టర్ అన్సారియా పనితీరు పట్ల సానుకూలంగా ఉన్నారు. ఎందుకంటే కలెక్టర్ల సమావేశంలో ఆమె నివేదికలు, సమస్యలపై పరిశీలన ఆయన్ను ఆకట్టుకున్నాయి. విజన్ డాక్యుమెంట్ ప్రజంటేషన్‌ను అభినందించారు. ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఇక పాలనలో ఎక్కడా పొరపాటు నిర్ణయాలకు కలెక్టర్ అన్సారియా తావివ్వడం లేదు. కొందరు పాలకపక్ష ఎమ్మెల్యేలు తమ మాట కలెక్టర్ వినడం లేదని అప్పుడప్పుడూ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వద్ద మొర పెట్టుకుంటున్నారు. ఒకరిద్దరు ఆమెను బదిలీ చేయించాలని కూడా కోరుతున్నట్లు సమాచారం. ఆమె పాలనలో ఎక్కడా తప్పిదాలకు అవకాశం లేకుండా ఇప్పటివరకూ నిబంధనల ప్రకారం వెళుతున్నారు. ఎమ్మెల్యేలు సిఫార్సులు చేసిన పనుల్లో చట్టబద్ధం గా ఉన్నవి మాత్రం చేస్తు న్నారు. అలాకాకుండా ఉంటే వాటిని తిరస్కరిస్తున్నారు. కారణాలు కూడా చెబుతున్నారు. అవి ఎమ్మెల్యేలకు రుచించడం లేదు. తాము చెప్పినట్లు జరగనందున.. కలెక్టర్ తమ మాట వినడం లేదనే భావనలోకి వెళ్లిపోయారు. అయితే కలెక్టర్ అన్సారియా జిల్లాలో ▶ 2లో



‘కూలి’పోయిన బతుకులు..

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు కూలీలు కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మకు గాయాలయ్యాయి.

కూలి పనులతోనే జీవనం..

గడ్డమీదపల్లికి చెందిన పగడాల రమణారెడ్డి, పగడాల సుబ్బమ్మ భార్యాభర్తలు. వీరికి రెండు ఎకరాల పొలం ఉంది. పంటలు సరిగా పండకపోవడంతో బొప్పాయి కోత పనులను వెళ్తున్నారు. నిత్యం ఆ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. అందులో ఒక అమ్మాయికి పెళ్లి చేశారు. మిగతా ఇద్దరూ చిన్నపిల్లలు. తల్లిదండ్రులిద్దరూ రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో ఆ ఇద్దరు పిల్లలూ అనాథలుగా మారారు.

బతుకుదెరువుకు వచ్చి..

పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలంలోని దావుపల్లి గ్రామానికి చెందిన జొన్నగిరి రామాంజి, ఆయన భార్య అంకమ్మ బతుకుదెరువు కోసం గడ్డమీదపల్లిలో చుట్టాలు ఉండటంతో వారి వద్దకు వచ్చారు. గత 20 రోజులు నుంచి గడ్డమీదపల్లిలోనే నివాసం ఉంటున్నారు. వీరు కూడా బొప్పాయి కోత కూలీలుగా వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోషించే పెద్దలిద్దరూ రోడ్డుప్రమాదంలో మృత్యువాత పడటంతో ఇద్దరు పిల్లలూ అనాథలుగా మారారు. కనబడిన వారినల్లా ‘మా నాన్న కావాలి’..‘మా అమ్మ కావాలి..’ అంటూ చిన్నారులు ఏడుస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

డ్రైవర్ పరిస్థితి విషమం..

ఆరు మంది కూలీలు, డ్రైవర్ కలిసి బొలోరో వాహనంలో నరసరావుపేటకు కూలీ పనులకు వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ కదిరి నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతని పరిస్థితి విషమంగా ఉంది. ఇతనిని పల్నాడు జిల్లా వినుకొండ వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇతనికి భార్య, ఒక చిన్న పాప ఉన్నారు. అదే వాహనంలో ప్రయాణిస్తున్న కన్నెబోయిన నాగమణికి స్వల్ప గాయాలు కాగా.. పగడాల శివమ్మకు చెయ్యి విరిగింది. దీంతో ఆమెను మార్కాపురం తరలించారు. బతుకుదెరువు కోసం వెళుతున్న వీరిని రోడ్డుప్రమాదం కబళించడంతో గడ్డమీదపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. రామాంజి, అంకమ్మ మృతదేహాలను వారి స్వగ్రామమైన దావుపల్లికి తీసుకెళ్లారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. అనధికారిక 183 లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి సానుకూలంగా, సలహాలతో డిటిసిపికి అనుమతుల కోసం లేఖ రాయాలని సూచించారు. కొత్త లేఅవుట్ల అనుమతులకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిబంధ నల మేరకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. మున్సిపాలిటీలలో, పంచాయతీలలో గృహ నిర్మాణాలకు అనుమతులకు సంబంధించి ప్రభుత్వం సూచించిన నియ మాలను పిపిటి ద్వారా బావుడా అధికారి వివరించారు. ఎవరైనా గృహాలు నిర్మించుకోవాలనుకునేవారు వారి దరఖాస్తులను పంచాయతీరాజ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా మాత్రమే చేసుకోవాలన్నారు. లేఅవుట్లు వేసేవారు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వేసుకోవాలని ఆయన లేఅవుట్ల యజమానులకు సూచించారు. నిబంధనల మేరకు లేఅవుట్లు వేసుకునే వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆటంకం ఉండదని, వారు నిస్సందేహంగా వ్యాపారం చేసుకోవచ్చని చెప్పారు. జిల్లాలో పంచాయతీ సెక్రటరీలు 167ఏ క్రింద అడ్డగోలుగా అవకతవకలకు పాల్పడుతూ లేఅవుట్లకు అనుమతులు ఇస్తున్నారని పేపర్లో వార్తలు వస్తున్నాయని, వార్తల ఆధారంగా ఆయా ప్రాంతాలను తనిఖీ చేసి దానికి కారకులైన వారి నివేదిక తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆయన ఆదేశించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారులు స్వయంగా వారి తహశీల్దార్లతో పర్యవేక్షిస్తూ ఇటువంటి అవకతవకలకు పాల్పడే సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిపిఓ ప్రభాకర్, బాపట్ల, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, బాపట్ల, రేపల్లె, అద్దంకి, చీరాల మున్సిపల్ కమిషనర్లు, బావుడా ప్లానింగ్ అధికారి షేక్ ఖలీషా, లైసెన్స్ టెక్నికల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

మోటుపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మోటుపల్లి ప్రాచీన ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి తెలిపారు. మోటుపల్లి గ్రామం, మ్యూజియం నిర్మాణం, వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్ లోని వీక్షణ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కాకతీయుల నాటి అభయ శాసనాలను తెలుగులో అనువదిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే పురావస్తు శాఖ పరిశోధకులు, శాసనాల పరిశోధకుల ద్వారా ఆ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. మూడు శాసనాలలోని తాత్పర్యం ప్రజలందరికీ అర్థమయ్యేలా సాధారణ తెలుగు భాషలోకి అనువదిస్తూ రాళ్లపై చెక్కిస్తున్నామన్నారు. ప్రాచీన వైభవం తెచ్చేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కోదండ రామ దేవాలయానికి సమీపంలోని 5.8 ఎకరాల భూమిని ఆలయానికి కేటాయిస్తూ ఆన్లైన్లో అప్లోడ్ చేసినట్లు తెలిపారు. 100 ఎకరాల సొన భూమి విషయమై శాసనసభ్యులతో మాట్లాడి ఆ భూమిని ఏపీటీడీసీకి కేటాయించి, అందులో బయోడైవర్సిటీని అభివృద్ధి పరచాలని, అందులో ఎటువంటి కట్టడాలు కట్టకూడదని షరతులు విధిస్తామని తెలిపారు.

కాకతీయులు, చోళ రాజుల నాటి శాసనాలు, పంచలోహాలను చిన్నగంజాంలోనే భద్రపరచడానికి మ్యూజియం నిర్మించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. మ్యూజియం నిర్మాణంపై పురావస్తు శాఖకు సమగ్ర నివేదికతతోపాటు లేఖ పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రాచీన సంపద ప్రస్తుతం హైదరాబాద్ మ్యూజియం, చెన్నై మ్యూజియం, విజయవాడ మ్యూజియంలో ఉందన్నారు. వాటిని తెప్పించడానికి దస్త్రాలను సిద్ధం చేయాలన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన విలువైన విగ్రహాలు పొరుగు రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాచీన కాలం నాటి బుద్ధుడి విగ్రహాన్ని భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన మార్గనిర్దేశం చేశారు. జిల్లా స్థాయి కమిటీలో చర్చించిన అంశాలలో పురోగతి కనిపించేలా అధికారులు వేగంగా పనులు ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధితో మోటుపల్లి మరింత ప్రాచుర్యం పొందనుందన్నారు. పురావస్తు శాఖ అధికారుల సహకారంతో మ్యూజియం ఏర్పాటుపై కమిటీలోని అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సూర్యప్రకాశరావు, చిన్నగంజాం తహశీల్దార్ ప్రభాకర్ రావు, మోటుపల్లి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూల్ ఈజ్ రూల్.!

(మొదటిపేజీ తరువాయి)

కీలక అంశాలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే కీలకమైన వ్యవహారాలు, వాటి నిర్ణయాలు ఎప్పటికప్పుడు మంత్రి డోలా వీరాంజనేయస్వామికి వివరిస్తున్నారు. జిల్లాలో మంత్రి కీలకం కనుక పాలనా పద్ధతులకు అనుగుణంగా ఆమె మంత్రికి అన్నీ వివరిస్తున్నారు. ఆయన సూచనలు, సలహాలకు అనుగుణంగానే పోతున్నారు. ఇక మంత్రి కూడా చట్టవిరుద్ధంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం కూడా లేదనే భరోసా కలెక్టర్‌కు ఇచ్చారని సమాచారం. రెవెన్యూ శాఖపరంగా కొన్ని తప్పిదాలు జరుగుతున్నాయి. భూముల విషయంలో పలువురు అధికారులు తీసుకున్న నిర్ణయాలపై కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారు. కనిగిరి, వైపాలెం తహశీల్దార్లపై తీసుకున్న చర్యలే ఇందుకు అద్దం పడుతున్నాయి. తప్పు చేసిన క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిపైనా చర్యలకు వెనుకాడటం లేదు. కనిగిరి ఆర్డీవో విషయంలోనూ ఆమె కఠినంగానే ఉన్నట్లు తెలిసింది. అక్కడ జరిగిన భూముల వ్యవహారాల్లోనూ, పాలక పక్ష నేతలతో సమన్వయం వంటి విషయాల్లో అధికారులపై వస్తున్న ఆరోపణలకు చర్యలు తీసుకోవాలనే ఆలోచనకు వచ్చిన కలెక్టర్ అన్సారియా మంత్రి సూచనతో ఆచీతూచీ అడుగులు వేయాల్సి వచ్చింది. ఎక్కువ మందిపై చర్యలు తీసుకుంటే పాలనలో ఇబ్బందులు వస్తాయని మంత్రి సూచించడంతో వెనక్కు తగ్గారు. సమీక్షల్లో కలెక్టర్ తనదైన శైలిలో ముందుకు పోతున్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో పర్యటించారు. భౌగోళికంగా పరిస్థితులను అవగాహన చేసుకుని ముందుకు సాగుతున్నారు. ప్రాధాన్యత రంగాలపై నివేదికలు తయారు చేసి నిధులు కోసం ప్రభుత్వానికి నివేదించారు. కొన్ని అంశాల్లో నేతలకు పట్టనివి కూడా కలెక్టర్ వాటిని పరిశీలించి.. నివేదికలు రూపొందించారు. జిల్లా డెయిరీ మూతపడింది. దాన్ని తెరిపించేందుకు రూ.75 కోట్లు నిధులు కావాలని సిఎం చంద్రబాబును కోరారు. 40 వేల పాడిరైతుల శ్రేయస్సు ఇందులో ఉంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.889 కోట్లు, ఆంధ్రకేసరి యూనివర్శిటీలో మౌళిక సదుపాయాల కల్పనకు రూ.203.15 కోట్లు నిధులు అవసరమని నివేదించారు. సాగర్ కాలువల ఆధునీకరణ పనులకు నిధుల అవసరాన్ని గుర్తించారు. అయితే పాలనలో నిబంధనల ప్రకారం పోవడం పాలకపక్ష ఎమ్మెల్యేకు మింగుడు పడటం లేదు. మంత్రి డోలా వద్ద కొందరు ఏ పనులూ కావడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. రూల్స్ ప్రకారం కలెక్టర్ పోతున్నారని మంత్రి కూడా భావిస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలకే మంత్రి డోలా సర్దుకొనిపోదామని సూచిస్తున్నారు. ఎందుకంటే మంత్రి కూడా నిబంధనల ప్రకారమే పోతున్నారు. కలెక్టర్‌ను నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని ఒత్తిడి చేస్తే మనకే చెడ్డపేరు వస్తుందని తమ పార్టీ ఎమ్మెల్యేలకు హితబోధ చేస్తున్నట్లు సమాచారం.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఎంఈవోకు మాతృవియోగం

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని అంకాళమ్మ వీధిలో గిద్దలూరు ఎంఈవో-2 పోలా నాగభూషణ్‌రెడ్డి మాతృమూర్తి నారాయణమ్మ స్వర్గస్థులయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. నివాళి అర్పించిన వారిలో టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, నంది శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఆర్డర్ 21 రూల్ 54 నోటీస్
మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జ్
వారి కోర్టులో
E.P. 42/2024
O.S. 140/2023

Between:-
కొమ్మనబోయన పూర్ణరావు..డి.హెచ్.ఆర్ /పిటిషనరు
V/s
పాలపర్తి శ్రీకాంత్ రెడ్డి. వగైరాలు
...జే.డి.ఆర్/ రెస్పోండెంట్

To,
పాలపర్తి శ్రీకాంత్ రెడ్డి, S/o. లేటు బాపిరెడ్డి
R/o. కొత్తపాలెం H/o. చెరుకూరు గ్రామం,
పర్చూరు మండలం, బాపట్ల జిల్లా

పై కోర్ట్ నందు పిటిషనరు, అమలు పిటిషన్ పరిహారం నిమిత్తం, మీ పై దాఖలు చేయగా, సదరు పిటిషను నందు మీహాజరు నిమిత్తం వాయిదా ది.16-06-2025.కావున మీరు పైకోర్ట్ వారి యెదుట వాయిదా తేదీ.16-06-2025 న ఉదయం గం. 10.30 ని.లకు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమున వ్యవహారం తీర్మానం చేయబడునని, ఇందు మూలంగా తెలియ చేయుట మైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 16-06-2025.
పర్చూరు
తేదీ.12-05-2025

ఇట్లు
పోతిని సురేంద్ర,
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి,
పిటిషనరు తరపు అడ్వొకెట్స్.

దావాసమను
మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి
వారి కోర్టులో
OS No: 33/2025

Between:-
కొలసాని శ్రీనివాసరావు ...వాది
V/s
మువ్వల సుబ్రహ్మణ్యం ...ప్రతివాది

To
మువ్వల సుబ్రమణ్యం
S/o. ఆంజనేయులు, Door No: 12-31,
పర్చూరు (Parchur DMC)

పై నెంబరు దావాలోని వాది మీపై ప్రోనోటు బాకీ రాబట్టుకొని నిమిత్తం దావా దాఖలు చేసి, మీకు దావా సమన్లు ఎన్నిసార్లు పంపిననూ జారీ కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము పై నెంబరు దావా మీహాజరు నిమిత్తం ది:18-06-2025 నకు వాయిదా అయిఉన్నది. కావున పైన ఉదహరించిన మీరు పై కోర్టు నందు ది:18-06-2025న ఉదయం గం 10-30 ని.లకు హాజరై మీవాదనను దాఖలు చేసుకొనని ఎడల మీపరోక్షమున తీర్మానము జరుగునని ఇందుమూలముగా తెలియపరచడ మైనది.

వాయిదా :18-06-2025

ఇట్లు
కొల్లా నరేంద్ర కుమార్
వాది తరపు న్యాయవాది
పర్చూరు
Cell no:- 9440638201.

పేరు మార్పు / సవరణ

నేను ముళ్ళపూడి వెంకాయమ్మ D/o ముళ్ళపూడి ఆదిశేషయ్య, నివాసం: డోర్ నెం. 12-44, ఎస్.వి.ఎస్. గ్రాండ్, ఐ.టి.ఐ. కాలనీ, 1వ లైన్, రైల్వే గేటు దగ్గర, దేశాయిపేట, వేటపాలెం, బాపట్ల, ఆంధ్రప్రదేశ్ - 523187. నా యొక్క తమ్ముడు ముండ్లపూడి శ్రీనివాసరావు, కటకం శివపార్వతి (జన్మత తల్లిదండ్రులు) గార్లకు జన్మించిన మధుసూదన్ ముందలపూడి గారిని 2019వ సం॥న దత్తత తీసుకోవటం జరిగినది. చీరాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో చట్టబద్ధంగా దత్తత స్వీకరించటం జరిగినది. ఇప్పుడు పేరు సవరణ చేయగా **ముళ్ళపూడి మధుసూధన్** S/o **ముళ్ళపూడి వెంకాయమ్మ** (దత్తత తీసుకున్న తల్లి) **(MULLAPUDI MADHUSUDHAN, S/o MULLAPUDI VENKAYAMMA** (Adopted Mother)గా పేరు మార్పు చేయటం జరిగినది. నేటి నుండి **ముళ్ళపూడి మధుసూధన్** గా పిలవబడును.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS AT ONGOLE, PRAKASAM DISTRICT
ARC No. 59 / 2024

BETWEEN:
M/s. **Shriram chits (India) Pvt Ltd.**
Ongole-I - DISPUTANT
VERSUS
Mudha Venkata Ramulamma
& amp 2 others - OPPONENTS

1. **Mudha Venkata Ramulamma,** W/o.**Sivaramulu,** R/o:D.No.1-4-46, Kotha Mamidi Palem,Ongole.
2. **Tippareddy Bhavani,** W/o **Krishna Reddy,** Junior Assistant, ID No. 0734429, O/o. Asst Tribal Welfare Office,Pragathi Bhavan,Ongole.
3. **Ganipineni Hari Kiran,** S/o. **Anandarao,** Junior Assistant, ID No. 00012965, A.P.Central Power Distribution Corporation Ltd,Circle Office, Ongole-523001.

Whereas the above named disputant has instituted a claim for recovery of Rs.3,50,672/-(Rupees Three lakh Fifty thousand Six hundred and Seventy two only) against you, you are hereby Summoned/Notice to appear in this Tribunal (Deputy Registrar of Chits) in person on the 27 th Day of May 2025 at O/o Dist-Registrar, Ongole, 10:30 A.M. in the forenoon, to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defense. Take notice that, in default of your appearance on the day before mentioned, the claim will be heard and determined in your absence.

DEPUTY REGISTRAR OF CHITS
ONGOLE, PRAKASAM DIST.

నోటీస్
మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జ్
వారి కోర్టులో
I.P. 14/2023

Between:-
కొమ్మన బోయన పూర్ణరావు ...
పిటిషనరు
V/s
పాలపర్తి శ్రీకాంత్ రెడ్డి. వగైరాలు
...రెస్పోండెంట్స్

To,
R1) పాలపర్తి శ్రీకాంత్ రెడ్డి.
S/o. లేటు బాపిరెడ్డి
R/o. కొత్తపాలెం H/o. చెరుకూరు గ్రామం,
పర్చూరు మండలం. బాపట్ల జిల్లా

పై కోర్ట్ నందు పిటిషనరు, పిటిషన్ పరిహారం నిమిత్తం, మీ పైదాఖలు చేయగా, సదరుI.P. పిటిషను నందు మీహాజరు నిమిత్తం వాయిదా ది.09-07-2025. కావున మీరు పై కోర్ట్ వారి యెదుట వాయిదా తేదీ.09-07-2025న ఉదయంగం. 10.30 ని.ల కు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమున వ్యవహారం తీర్మానం చేయ బడునని, ఇందు మూలంగా తెలియ చేయుట మైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 09-07-2025.
పర్చూరు
తేదీ.12-05-2025

ఇట్లు
పోతిని సురేంద్ర,
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి,
పిటిషనరు తరపు అడ్వొకెట్స్.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహిళలు వారి కాళ్ళపై నిలబడేలా నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. బిసి సంక్షేమ శాఖ సౌజన్యంతో ఒంగోలు నగర పరిధిలోని 15వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే దామచర్ల దంపతులు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ద్వారా మహిళల్లో నైపుణ్యం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరానికి 6 ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలు మంజూరు చేసిందని, వీటిలో 4 కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించామన్నారు. కుటుంబంలో మహిళలు ఏదొక వృత్తిలో ఉండాలని, ఎవరూ ఖాళీగా ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. వారికి శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా వేసవిలో 3 నెలల పాటు మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తుందన్నారు. కుట్టు మిషన్ ఖరీదు రూ.6 వేల నుంచి రూ.6,500 ఉంటే శిక్షణ అనంతరం సబ్సిడీపై కుట్టు మిషన్ అందజేస్తారన్నారు. కుట్టు శిక్షణ నేర్చుకున్న వారు మరో 10 మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యమనేది మహిళలకు ఆదాయ వనరు అని, నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే మహిళల కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. 2014-19 మధ్య కాలంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను విజయవంతంగా నడిపి మహిళా సాధికారతకు తోడ్పడ్డారన్నారు. త్వరలోనే విజయవాడ నుంచి శిక్షకులకు తీసుకొచ్చి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పునరుద్ధరిస్తామన్నారు. ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో సుమారు 144 మందికి ఉదయం, సాయంత్ర వేళల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణను వినియోగించుకొని మహిళలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల సతీమణి దామచర్ల నాగ సత్యలత, 15వ డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్, శిక్షకురాలు సునీత, టిడిపి నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

గుండెపోటుతో ఆర్మీ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-రాచర్ల


మనోహర్ (ఫైల్)

రాచర్ల మండలం రాచర్ల గ్రామానికి చెందిన గంజికుంట్ల మనోహార్(40) అనే ఆర్మీ ఉద్యోగి మహారాష్ట్రలో విధులు నిర్వహిస్తూ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు మహారాష్ట్ర ఆర్మీ అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మనోహర్ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె, తల్లి ఉన్నారు. భార్యాపిల్లలు ఆయనతో పాటు మహారాష్ట్రలో ఉన్నారు. రాచర్లలో ఉన్న మనోహర్ తల్లి వెంకట లక్ష్మమ్మను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కలిశారు. మనోహర్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసి తన ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తూ ఆమెకు మనోధైర్యం చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-అద్దంకి


లభ్యమైన మృతదేహం

సింగరకొండ కమ్మ సత్రం సమీపంలోని ఒక చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, వ్యక్తి వివరాలు తెలిస్తే అద్దంకి సీఐ ఏ.సుబ్బరాజు 9121102167 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని పోలీసులు కోరారు.

అదుపుతప్పి లారీ బోల్తా

ప్రజాశక్తి-పంగులూరు

ఎదురుగా వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో అతి వేగంగా ప్రయాణిస్తూ కోడిగుడ్ల లారీ బోల్తా పడిన సంఘటన మంగళవారం జాతీయ రహదారిపై ముప్పవరం గ్రామంలోని తెలుగుదేశం పార్టీ ఆఫీసు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న కోడిగుడ్లు మొత్తం పగిలిపోయాయి. వివరాల్లోకి వెళితే బోయపాలెం నుంచి కోడిగుడ్ల లారీ ప్రకాశం జిల్లా టంగుటూరు వెళుతుంది. ముప్పవరంలోని తెలుగుదేశం పార్టీ ఆఫీసు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వెళుతున్న వాహనాన్ని దాటేందుకు కోడిగుడ్ల వాహనం వేగంగా ముందుకు వచ్చి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో పాటు ప్రయాణిస్తున్న మరో ముగ్గురు వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. వాహనంలోని కోడిగుడ్లన్నీ పగిలిపోయి నష్టం వాటిల్లింది. ట్రాఫిక్కు అంతరాయం లేకుండా హైవే సిబ్బంది చర్యలు చేపట్టారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలోని పెద్ద పీఆర్‌సి తండాలో మంగళవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దాడులు చేసి 10 లీటర్ల నాటుసారాతో పాటు నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 260 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నిందితుడు ఆర్.సుర్మల్ నాయక్‌ని అదుపులోకి తీసుకున్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా జైలు శిక్ష తప్పదని యర్రగొండపాలెం ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు అన్నారు. ఈ దాడుల్లో యర్రగొండపాలెం ఎక్సైజ్ ఎస్ఐ, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ పాల్గొన్నారు.

నిషేధిత మందులు స్వాధీనం

ప్రజాశక్తి-ఒంగోలు క్రైమ్


అధికారులు స్వాధీనం చేసుకున్న నిషేధిత మందులు

ఒంగోలు పట్టణంలోని గోపాలనగర్‌లో రావులకొల్లు శేషమ్మ ఇంటి వద్ద కేంద్రం ప్రభుత్వం నిషేధించిన ఆక్సిటోసిన్ ద్రావణం కలిగిన పశువులకు ఉపయోగించే 700 సీల్డ్ ప్లాస్టిక్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం ఆధారంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచి ఉండగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వాటిని సీజ్ చేసి ఎనాలిసిస్ నిమిత్తం శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపి రిపోర్ట్ వచ్చిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరావు, సంధ్య, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర ప్రసాద్, వెటర్నరీ ఏడి, సిబ్బంది పాల్గొన్నారు.

లైన్‌మెన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-దర్శి

ఆర్డబ్ల్యూఎస్ స్కీములో పని చేస్తున్న లంకోజనపల్లికి చెందిన లైన్‌మ్యాన్ చెరుకూరి శ్రీనివాసరావు(44) గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి సిపిఐ, ఏఐటియుసి నివాళులు అర్పించారు. శ్రీనివాసరావుకు భార్య, కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావు గత 20 సంవత్సరముల నుంచి నుండి దర్శి మండలంలోని గంగపాలెం, బండివెలిగండ్ల, కట్లసింగన్నపాలెం, ఎరఒబనపల్లి గ్రామాలలో మంచినీటిని అందిస్తూ ప్రజల మన్ననలు పొందారు. నాయకులు మాదపాకుల రమేష్‌బాబు, జూపల్లి కోటేశ్వరరావు, రాసపూడి కరుణానిధి, కె.హనుమంతరావు, ఆర్డబ్ల్యూఎస్ జిల్లా నాయకులు సింగరకొండ శ్రీనువాసరావు, ఏ.బాబు, విజయ్, జె.నారాయణ, జి.బ్రహ్మయ్య, జె.లోకయ్య, బాబు, పరమేశ్వరం నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఆదిలక్ష్మమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-పొదిలి

టిడిపి సీనియర్ కార్యకర్త, ఆర్యవైశ్య సంఘం నాయకులు సామి రాజా, రవికిశోర్‌ల మాతృమూర్తి ఆదిలక్ష్మమ్మ సోమవారం వయోభారంతో మృతి చెందారు. పొదిలి విశ్వనాథపురంలోని వారి గృహంలో మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదిలక్ష్మి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ఆవులూరి యలమంద మండలం మరియు పట్టణ నాయకులు ఉన్నారు.

జి.అగ్రహారంలో సర్వే

ప్రజాశక్తి-మర్రిపూడి: మండలంలోని గోసుకొండ అగ్రహారంలో మంగళవారం ఉమ్మడి బృందం సర్వే నిర్వహించారు. ఏవో వెంకటేష్ మాట్లాడుతూ గోసుకొండ అగ్రహారం గ్రామాన్ని 4 క్లస్టర్లుగా విభజించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడిఎ శ్రీనివాసరావు, వినోద్ తారా సింగ్, రామకృష్ణ, ప్రసాదరావు, సుధాకర్, రెవెన్యూ అధికారి ఏబేలు, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు శర్మ, గ్రామ సర్వేయర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దామచర్లను కలిసిన తాలూకా సిఐ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దనరావును ఒంగోలు తాలూకా సిఐ విజయ్ కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావును కలిసిన తాలూకా సిఐ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు విషయాలు చర్చించుకున్నారు.


ఎమ్మెల్యేతో తాలూకా సిఐ

పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

అధికారులకు జెసి ఆర్.గోపాలకృష్ణ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రమాదకర పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక జెసి ఛాంబర్‌లో ఈ విషయమై మంగళవారం పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భద్రతా చర్యలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. నెల్లూరు ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు ప్రమాదకర పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెసి గోపాలకృష్ణ

అసంపూర్తి పనులు..

పైపులు వేసి కుళాయిలు బిగించని వైనం

డీటీపల్లిలో తీవ్రమైన నీటి సమస్య

అందని జలాలు..


ట్యాప్‌లు బిగించకుండా వదిలేసిన పైపులు

ప్రజాశక్తి- సిఎస్ పురం రూరల్

ఇంటింటికీ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన జల జీవన్ మిషన్ పనులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో మధ్యలోనే నిలిచిపోయాయి. గ్రామంలో పైపు లైన్లు ఏర్పాటు చేసినా ట్యాపులు బిగించకపోవడంతో నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్తులకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని డీటీ పల్లి (దర్శి తిమ్మకృపల్లె)లోని పరిస్థితి ఇది.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం..

మండలంలోని డీటీపల్లి (దర్శి తిమ్మకృపల్లి) గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ నీటి కుళాయి ఏర్పాటు చేసేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. గ్రామంలో పైపులు వేశారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి ప్రత్యేకంగా బోరు వేశారు. అయితే ఇంటింటి వరకు ఏర్పాటు చేసిన పైపులకు పూర్తి స్థాయిలో కుళాయిలు, టాప్‌లు బిగించ లేదు. దీంతో గ్రామంలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని కొన్ని గృహాల వద్ద మాత్రమే పైపులకు ట్యాప్‌లు బిగించారని, మిగిలిన చోట ట్యాప్‌లు బిగించకపోవడంతో నీరు వృథాగా పోతున్నదని, దీంతో పై ప్రాంతంలో ఉండే గృహాల వారికి నీరు రావడంలేదని నాగరత్నమ్మ, సుబ్బమ్మ, పోలా తిరుపతమ్మ, ఎర్రశెట్టి రాజేశ్వరి తదితర మహిళలు వాపోయారు. దీనికి తోడు ఈ పథకం డీప్ బోర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో దాదాపు వారం రోజులుగా నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. ఊరిలో ఉన్న ఒకే ఒక చేతిపంపులో వచ్చే నీటిని వాడుకుంటూ అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గృహాల వద్ద ఏర్పాటు చేసిన పైపులకు ట్యాప్‌లు ఏర్పాటు చేసి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పించి నీటి కోసం ఇబ్బందులు తప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డిని ప్రజాశక్తి వివరణ కోరగా జల జీవన్ మిషన్ పథకంకు సంబంధించిన స్కీంను ఆ శాఖ అధికారులు తమకు అప్పగించలేదన్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా డిటి పల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం పనులను గత ఏఈ రమేష్ పర్యవేక్షిస్తున్నారని ఆయనతో మాట్లాడి వెంటనే పనులను పూర్తి చేయించే ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ విషయమై విద్యుత్ శాఖ ఏఈ రసూల్‌ను వివరణ కోరగా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ని మార్పించే ఏర్పాటు చేస్తామన్నారు.


మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



అవార్డు అందుకుంటున్న అన్నం శ్రీనివాసరావు

పీడీ శ్రీనివాసరావుకు అవార్డు

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ అండ్ ఫిజికల్ డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావుకు బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పర్సనల్ అవార్డ్ పొందినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె జగదీష్ బాబు మాట్లాడుతూ మే 10న కాకినాడ జెఎన్‌టియు ఆధ్వర్యంలో జరిగిన యూనివర్సిటీ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్‌లో అవార్డు పొందినట్లు చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరంలో కాకినాడ జెఎన్‌టియు స్థాయిలో పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, ట్రైక్వాండ్ బాలురు, బాలికల విభాగాల్లో, బాడీ బిల్డింగ్ బాలుర విభాగంలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ కళాశాలల్లో జరిగిన పోటీల్లో తమ కళాశాల జట్టు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విన్నర్స్‌గా నిలిచారని అన్నారు. ఎంబిఎ ద్వితీయ సంవత్సర విద్యార్థి సయ్యద్ ఖాజావలి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ 93కేజీల విభాగంలో యూనివర్సిటీ తరపున గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. కాకినాడలో జరిగిన యూనివర్సిటీ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్‌లో ఖాజావలికి రూ.25వేల చెక్కును వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌విడి అనిల్ కుమార్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి సిహెచ్ హరికిషన్ పాల్గొన్నారు.


కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న చేనేతలు

విద్యుత్ రాయితీకి అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని దేవాంగపురి పంచాయతీ సెక్రటరీ మందలపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేనేతల విద్యుత్తు రాయితీ 200 యూనిట్స్ ఉచిత పథకానికి అర్జీలు స్వీకరించే కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. 350 మందిపైగా చేనేత కార్మికులు నమోదు చేసుకున్నారు. చేనేతలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి ఎన్నికల హామీల్లో భాగంగా నెలకు 200 యూనిట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్తు ఇవ్వనున్నట్లు సెక్రటరీ తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, టిడిపి నాయకులు సిద్ది బుచ్చేశ్వరరావు, సజ్జా బాల నందం, ఉప్పుగంటి సాంబశివరావు, నాసిక శివాజీ, గుత్తి బాల సుబ్రహ్మణ్యం, పృథ్వి లలిత కుమార్, పృథ్వి వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ తోట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పి-4 సర్వేపై సమీక్ష

ప్రజాశక్తి - కారంచేడు

పి 4 సర్వేపై ఫారం జోడిలో మంగళవారం సమావేశం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె నేతాజీ మాట్లాడుతూ పి4 మార్గదర్శిని వెతకడంలో, కుటుంబానికి కావలసిన అవసరాలు తెలుసుకొనుటకు సమావేశం పంచాయతీ, సచివాలయాల సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో కుటుంబాల వారీగా వివరాలు సేకరించాలని చెప్పారు. కుటుంబ అవసరాలు, సహాయపడగలిగిన వారి వివరాలు నమోదు చేయాలని, సేకరించిన వివరాలను తమకు అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టిడిపి నాయకులు, వెలుగు టి మోహనరావు పాల్గొన్నారు.

జెవివి వేసవి శిక్షణా తరగతులు


వేసవి శిక్షణ ప్రారంభిస్తున్న వై భాస్కరరావు

ప్రజాశక్తి - బాపట్ల

వేసవి సెలవుల్లో పిల్లలకు జ్ఞానం, వినోదం, ఆట, పాటలతో కూడిన వేసవి శిక్షణ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మనోవికాసం పెంపొందుతుందని జెవివి జిల్లా అధ్యక్షుడు వై భాస్కరరావు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో విద్యార్థులకు భావపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ నేపథ్యంలో విద్యను అంగడి సరుకుగా మార్చేశారని అన్నారు. ఈ శిక్షణ ద్వారా చిన్నారులు వినోదంతో పాటు సమాజం పట్ల నడవడికను తెలుసుకుంటారని అన్నారు. శిక్షణలో ఉపాధ్యాయులు రంగారెడ్డి మ్యాజిక్ షో నిర్వహించారని తెలిపారు. ఇటీవల యుద్ధంలో వీరమరణం పొందిన అమరులైన వీర జవాన్లకు చిన్నారులు మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు భాను తేజ, ఐద్వా నాయకులు టి సుభాషిణి, జంగం స్పందన పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని తోకలవారిపాలెంలో వేసవి శిక్షణ రెండో రోజు పిల్లలకు ఇంగ్లీష్ సబ్జెక్టుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి కృష్ణమోహన్, సిపిఎం మండల కార్యదర్శి వేమూలపల్లి వెంకట రామయ్య, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి బి సుబ్బారావు పాల్గొన్నారు.


తోకలవానిపాలెంలో 2వ రోజు వేసవి శిక్షణ

వైసిపికి 'జంజనం' రాజీనామా

◆ నేడు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ◆ అవిశ్వాసం నెగ్గేనా.. వీగేనా..? ◆ అవిశ్వాసంపై కౌన్సిలర్ల ఉత్కంఠ

ప్రజాశక్తి - చీరాల


చైర్మన్ శ్రీనివాసరావు

మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మీడియాకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రాజీనామా లేఖను పంపుతున్నట్లు తెలిపారు. తాను వ్యక్తిగత కారణాలతో వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, తనకు మున్సిపల్ చైర్ పర్సన్ అవకాశం కల్పించి చీరాల ప్రజలు, చేనేత వృత్తిదారులకు పరిపాలన సేవ చేసే భాగ్యం కల్పించినందుకు మాజీ శాసన సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు మేరుగా నాగార్జున, ఇంచార్జ్ కరణం వెంకటేష్‌కు లేఖను జతపరుస్తూ పంపించారు. ఆయన గత నెల 30న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టిడిపిలో చేరిన సంగతి తెలిసిందే. వైసీపీకి రాజీనామా చేయటంతో టిడిపిలో చైర్మన్ హోదాలో ఉన్నారు. ఆయన ప్రస్తుతం టిడిపిలో చేరారు కాబట్టి అవిశ్వాసం వీగి చైర్మన్ పదవిలోనే ఉంటారా? లేక ఈపాటికే అవిశ్వాసం కోరుతున్న 22 మంది కౌన్సిలర్లు మరెవరినైనా చైర్మన్‌గా ప్రతిపాదిస్తారా? అనే ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఇది ఇలా ఉండగా వైసీపీ సభ్యత్వానికి గత నెల 29నే రాజీనామా చేసినట్లుగా ఉండటం, గతనెల 30న టిడిపిలో చేరటం కొసమెరుపు. అవిశ్వాస అంశం పట్టణంలో హాట్ టాపిక్ అయ్యింది.

సీబీఎస్ఈ ఫలితాల్లో ఢిల్లీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చెరుకుపల్లి


కొక్కిలిగడ్డ నేహా


మానస


వైష్ణవి

10వ తరగతి సిబిఎస్ఈ ఫలితాల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి బాపట్ల, ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్షకు హాజరైన 52 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లుగా తెలిపారు. కొక్కిలిగడ్డ నేహ 96.4శాతం సాధించినట్లు తెలిపారు. ఏడుగురు విద్యార్థులు 90శాతం పైగా సాధించారని తెలిపారు. టాప్ 3లో ముగ్గురు బాలికలు 95శాతం పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు నేహ, మానస, వైష్ణవి, వీర వెంకట శ్రీరామ్, శివస్కంధ, ఐశ్వర్య, హరిత్ శ్రీరామ్ 90శాతంపైన మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ షైనం ఏడుకొండలురెడ్డి, కరస్పాండెంట్ సాయి రంగారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ కలువ సుభాష్ చంద్రబోస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ వందన శర్మ, టెన్త్ క్లాస్ ఇంచార్జ్, గణితం ఉపాధ్యాయుడు జగదీష్, తెలుగు, ఇంగ్లీష్, సోషల్ ఉపాధ్యాయులు అనిల్, చిరంజీవి, శ్రీనివాసరావు అభినందించారు. ఎన్డీఎ లాంటి డిఫెన్స్ కోచింగ్ కొరకై తమ పాఠశాల్లో ఈ విద్యా సంవత్సరం నుండి ఎడిఎ, సిడిఎస్, ఎఎఫ్‌సిఏటి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలాగ అకడమిక్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

టిడిపి నాయకులు దయాబాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల


నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

తెలుగుదేశం సీనియర్ నాయకులు తానికొండ దయాబాబుకు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. సోమవారం రాత్రి మరణించిన దయా బాబు మృతదేహానికి టిడిపి జండా కప్పి టిడిపి నేతలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో ఎంపి కన్నేటి కృష్ణ ప్రసాద్, బాపట్ల, వేమూరు శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు స్మశాన వాటికకు చేరుకొని దయ బాబుకు అంతిమ వీడ్కోలు పలికారు.


సమ్మె నోటీసులు అందజేస్తున్న సిఐటియు నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వేమూరు

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల మార్పి కేంద్ర ప్రభుత్వం తెస్తున్న 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం దేశ వ్యాప్తంగా ఈనెల 20న జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి అగస్టీన్ కోరారు. స్థానిక సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమలు జరిగితే కార్మిక చట్టాలు వర్తించవని, కార్మికులు బానిసత్వంలోకి నెట్ట బడతారని అన్నారు. కనీసం సంఘం పెట్టుకునే హక్కు కూడా ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సివిల్ సప్లైస్ ఇంచార్జి సుబ్రహ్మణ్యంకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యార్డ్ మేస్త్రీ వేమూరి విజయరాజు, వేమూరి యోహాను, జుజ్జువరపు కిషోర్ బాబు పాల్గొన్నారు.

ఖాతాదారులకు విస్తృత సేవలు

ప్రజాశక్తి - పంగులూరు


ఎపి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బి ప్రశాంత్

గ్రామీణ ప్రాంతంలో ఉండే ప్రజానీకానికి అవసరమైన అన్ని రకాల సేవలను తమ బ్యాంకు ద్వారా అందిస్తున్నట్లు ముప్పవరంలోని ఎపి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బి ప్రశాంత్ అన్నారు. మంగళవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తమ బ్యాంకులో డిపాజిట్ చేసిన ఖాతా దారులకు మిగతా అన్ని బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ ఇస్తున్నామని అన్నారు. ఏడాదికి 7.6 శాతం వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్స్ అయితే 8.1 శాతం వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వడ్డీ మదుపరులకు ఎంతో ఉపయోగమని అన్నారు. తమ బ్యాంకు ద్వారా గతేడాది పొదుపు మహిళా గ్రూపులకు రూ.9.60 కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. పంట రుణాలు రూ.7.25కోట్ల రుణం ఇచ్చామని చెప్పారు. రుణాల వసూళ్లు ఈ సంవత్సరం కేవలం రూ.9.35 లక్షలు మాత్రమే మొండిబకాయలు మిగిలి ఉన్నాయని చెప్పారు. బంగారు రుణాల ద్వారా కూడా తమ బ్యాంకు ఖాతాదారులకు మంచి సౌకర్యాలు అందిస్తున్నామని అన్నారు. గ్రాము బంగారానికి రూ.6వేలు 9.75 శాతం వడ్డీతో రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి సోలార్ సబ్సిడీ లోన్స్ ఈఏడాది ముగ్గురికి రూ.6లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. తమ బ్యాంకులో లాకర్ సౌకర్యం, ఎటిఎం, మొబైల్ బ్యాంకింగ్ మొదలైన సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు, ఖాతాదారులు తమ సౌకర్యాలను ఉపయోగించుకోవాలని కోరారు.

పమిడిపాడు మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల


కేసరి వెంకటరెడ్డి (76)

మండలంలోని పమ్మిడిపాడు మాజీ సర్పంచ్ కేసరి వెంకటరెడ్డి (76) మంగళవారం ఉదయం గుంటూరు లలిత హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన పమిడిపాడు సర్పంచిగా, పమిడిపాడు సొసైటీ అధ్యక్షునిగా పనిచేసి తనకంటూ ఒక ప్రాధాన్యతను పొందారు. గ్రామంలోని హేబిటేషన్ గ్రామమైన కృష్ణంరాజుపాలెంకు చెందిన ఆయన రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అతనికి భార్య, కుమారుడు ఆస్ట్రేలియాలో ఉన్నట్లు సమాచారం.

వేతన బకాయిలు చెల్లించాలని..

టోల్ ప్లాజా సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

టోల్ ప్లాజా సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. టంగుటూరు టోల్ ప్లాజా కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ టోల్‌ప్లాజా సిబ్బందికి 2013 నుంచి నేషనల్ హాలిడేస్, పెయిడ్ హాలిడేస్ సంబంధించిన బకాయిలు చెల్లించకుండా యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికచట్టాన్ని అనుసరించి ప్రతి ఆరు నెలలుకు విడిఎ పెంచాల్సిఉందన్నారు. ప్రతి ఏటా ఇంక్రిమెంట్ ప్రకటించి అమలు చేయాల్సి ఉందన్నారు. అయితే యాజమాన్యం అలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. జాతీయ రహదారిపై వాహనాలు వెదజల్లే విషవాయువుల నుంచి సిబ్బందికి ఎలాంటి రక్షణ సౌకర్యం కల్పించకుండా, రాత్రి, పగలు వారి చేత పనిచేయుస్తున్నట్లు తెలిపారు. విశ్రాంతి సౌకర్యం, క్యాంటిన్ సదుపాయాలు కల్పించకుండా ఉద్యోగుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే వేతన ఒప్పందం జరపాలని డిమాండ్ చేశారు.సమస్యలు



ధర్నా నిర్వహిస్తున్న టోల్ ప్లాజా సిబ్బంది

పరిష్కారం అయ్యేంత వరకూ సిఐటియు కార్మికులకు అండగా నిలుస్తుందని తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు టంగుటూరు రాము మాట్లాడుతూ జాతీయ రహదారిపై టంగుటూరు, బాపట్ల జిల్లా బొల్లాపల్లి టోల్ ప్లాజాల్లో 2011నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్స్ సిబ్బంది వేతనాలు 15 ఏళ్ల కాలంలో కేవలం రూ.18 మాత్రమే పెంచినట్లు తెలిపారు. లీవ్‌ఎన్‌కాష్‌మెంట్, గ్రాడ్యుటీ, ఇంక్రిమెంట్ లాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. సమస్యలకు పరిష్కారం చూపాలని ఫిబ్రవరి 1 నుంచి దశల వారి కార్మికులు ఆందోళన చేపట్టినప్పటికీ యాజమాన్యం దిగి రాలేదన్నారు. మార్చి 31 ఒకసారి, ఏప్రిల్ 30న మరోసారి సమస్యలు పరిష్కారిస్తామని యాజమాన్యం రాతపూర్వకంగా ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. యూనియన్ నాయకురాలు దేవరపల్లి శతి మాట్లాడుతూ టోల్ ప్లాజా వద్ద పనిచేసే మహిళలకు కనీస సదుపాయాలు లేవన్నారు, ప్రసూతి సెలవలు ఇవ్వనందున పసిబిడ్డలతో వచ్చి పని చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం సిబ్బంది అంబేద్కర్ భవన్, చర్చి సెంటర్ మీదుగా ప్రదర్శన గా వెళ్లి జాయింట్ కలెక్టర్ గోపాల కష్ణ, నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ కు వినతి పత్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి. మోజెస్, టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దుగ్గిరాల తిరుమల రావు, గేరా కాశీవిశ్వనాథ్, రాజశేఖర్, నరేంద్ర, కోటేశ్వరరావు, మస్తాన్, చెన్న పూర్ణ దేవి, బెజవాడ శ్రీదేవి, దాసరి సుమలత, ఎ.వసంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



శైలజకు మొక్క అందజేస్తున్న దామచర్ల సత్య

శైలజను కలిసిన దామచర్ల సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నియమితులైన రాయపాటి శైలజను మంగళగిరిలోని మిడ్ వ్యాలీలోని ఆమె నివాస గృహంలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి మొక్క అందజేశారు.శుభాకాంక్షలు తెలిపారు.

పొగాకు బేళ్ల తిరస్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా నాణ్యమైన బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురావాలని స్థానిక వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. దావగూడూరు, చింతలపాలెం గ్రామాలకు చెందిన రైతులు 881 పొగాకు బేళ్లను మంగళవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 705 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 176 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ. 205, సరాసరి ధర రూ.250.48 పైసలు పలికింది. వేలంలో 15 కంపెనీల ప్రతినిధులుపాల్గొన్నారు.

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రంలో 286 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు.పెద్దకళ్లగుంట, నరసరాజుపాలెం, అయ్యప్పరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1188 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 902 బేళ్లను తిరస్కరించారు. వివిధ కారణాలతో 286 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యల్ప ధర రూ. 280, అత్యల్ప ధర రూ. 210, సరాసరి ధర రూ.242.17 పైసలు పలికింది.



రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసిన ఆలయం

నేడు ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

ప్రజాశక్తి-చీమకుర్తి : మండలపరిధిలోని కెవి.పాలెంలో బుధవారం ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. తిరునాళ్లకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. టిడిపి, వైసిపి ఆధ్వర్యంలో విద్యుత్ మందిరాలు ఏర్పాటు చేస్తున్నారు. సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా నాట్యమండలి సహకారంతో ప్రజా పాటల సందడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాపాటల సందడి కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శీనివాసరావు పాల్గొననున్నారు. తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మందిరాలపై ఆయా పార్టీల వారు సినీ, టీవీ యాంకర్లతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బాలికా వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-పొన్నలూరు : మండల పరిధిలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి అధ్యక్షతన కిషోర బాలికా వికాసం సమ్మర్ క్యాంప్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కిషోర వికాసం అనేది బాలికల ఆరోగ్యం, విద్య, పోష కాహారం మరియు ఇతర అవసరాలపై దష్టి కేంద్రీ కరించేందుకు ఉపయోగ పడుతుందన్నారు. బాలికలను ఆత్మరక్షణ,.బాల్యవివాహం నిర్మూలనపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రవణమ్మ, అంగన్‌వాడీలు పద్మావతి, సత్య, ఎడబ్ల్యుహెచ్ అంకమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పజిల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు : వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మండల పరిధిలోని ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో తెలగతోటి శామ్యూల్ విద్యార్థులకు తెలుగు పదాలతో పజిల్స్ మంగళవారం నేర్పించారు. ఊరు పేర్లతో మ్యాజిక్ షో చేసే విధానం గురించి వివరించారు. మానస విద్యార్థులకు చేతి వేళ్ళ ద్వారా మన బ్రెయిన్ యాక్టివేట్ క్లాసుతో పాటుగా పదాలు షార్ప్‌గా ఎలా గుర్తించవచ్చు అనే అంశం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు ప్రసాదు, లక్ష్మి ప్రియ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేపాల్‌దేవ్ భట్టాచార్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రాజ్యసభ మాజీ సభ్యులు, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ జాతీయ అధ్యక్షుడు నేపాల్ దేవ్ భట్టాచార్యకు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు మంగళవారం ఘన నివాళులర్పించారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు , ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అయ్యపరెడ్డి, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ ,ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, దాసరి రమేష్, తిరుమలయ్య, అల్లడి సుబ్బారావు తదితరులు నేపాల్ దేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ బాధ్యతలు నిర్వహించడంలో నేపాల్ దేవ్ భట్టాచార్య సమర్ధవంతమైన కృషి చేసారన్నారు. బెంగాల్ రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికై కార్మికుల ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంలో కీలకమైన పాత్ర పోషించారన్నారు. నేపాల్‌దేవ్ అకాల మరణం కార్మిక ఉద్యమానికి తీవ్ర లోటని తెలిపారు. నేపాల్‌దేవ్ కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

శిద్దా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి చీమకుర్తి

కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు సేవా కార్యక్రమాలతో మంగళవారం నిర్వహించారు. తొలుత స్థానిక కష్ణ సాయి గ్రానైట్స్ కంపెనీ ఆవరణలో కార్మికుల మధ్య తన తల్లి శిద్దా హైమావతి, సతీమణ శిద్దా సూర్యకుమారి , శిద్దా ఆశిష్‌లతో కలిసి వెంకటేశ్వర్లు కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. జిజిహెచ్‌ఎస్ వైద్యులు మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శిద్దా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 మంది రక్తదానం చేశారు. ఒంగోలు-కర్నూల్ రోడ్డు పక్కన కార్మికులు, పాదచారులు దాహార్తి కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులకు బోనస్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు శిద్దా వెంకటేశ్వరరావుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు డి.రామచంద్రారెడ్డి, ఆర్.రాజా,రాంబాబు, టివి.మురళీమోహనరావు, బి. కమలాకర్, అప్పారావు, ఆంజనేయులు, సలీం, శివ, సురేష్ , సంతనూతలపాడు మాజీ సర్పంచి రంకారావు, ఆర్.యోగయ్య ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న శిద్దా వెంకటేశ్వరరావు దంపతులు



కల్యాణం జరిపిస్తున్న నారాయణరావు దంపతులు

కోదండరామస్వామి కల్యాణం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామంలో శ్రీకోదండరామస్వామి తిరునాళ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పులగం నారాయణరావు, చంద్రకళమ్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం పుర వీధుల్లో రథోత్సవ నిర్వహించారు.

గజ వాహనంపై వేణుగోపాలుడు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి బ్రహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గజ వాహనంపై శ్రీవేణుగోపాలుడు రుక్మిణి, సత్యభామా సమేతంగా మంగళవారం కొలువు దీరాడు. ఈసందర్భంగా ఎదురుకోలు ఉత్సవం నిర్వహించారు. అమ్మవార్ల తరుపున ఆళ్వారులు ,శ్రీవేణుగోపాల స్వామి తరుపున గ్రామస్తులు పెద్దలుగా వ్యవహరించారు. . పూజారి దీవి శ్రీధరాచార్యులు స్వామిని వార్లను ప్రత్యేక అలంకరించారు.సాయంత్రం రంగురంగుల విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు సన్మానం


రైతులను సన్మానిస్తునన అధికారులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

రైతులు ప్రకృతి వ్యవసాయంతోనే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మాస్టర్ ట్రైనర్ శిరీష తెలిపారు. మండలంలోని కుందుర్రు రైతు సేవ కేంద్రం నందు ప్రకృతి వ్యవసాయ గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. సభలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నాగభోతు సుజాత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవడమే మంచిదన్నారు. రసాయనిక రహిత పంటలు పండించుకుని ఆరోగ్యం కాపాడుకోవడమే కాకుండా వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చని అన్నారు. ఖరీఫ్ ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించేందుకు సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలకరి జల్లుకు ముందు భూమిలో సూక్ష్మ పోషకాలు చనిపోకుండా 18 రకాల ధాన్యాలను (పిఎండిఎస్ కిడ్స్) ద్వారా భూమిపై చల్లి తొలకరిజల్లుకు సిద్ధం చేసినట్లయితే పోషకాలు చనిపోకుండా ఉంటాయని తెలిపారు. ఇండ్ల వద్ద కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేసుకుని తమకు సరిపడా ఆకుకూరలు పండించుకోవడం వల్ల ఆరోగ్యకరమైన ఆహారాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొప్పక కొండలు, బోడేపూడి రామారావు, ఎల్‌టి వెంకటలక్ష్మి, వెంకటరత్నం, సులోచన, కోటేశ్వరమ్మ, నూరిమ, లాల్ బి, కాలేశావళి పాల్గొన్నారు.

పర్చూరు : రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చని ఎడిఎ మోహనరావు తెలిపారు. మండలంలోని నూతలపాడు పంచాయతీ ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చని చెప్పారు. ఈ ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రధాన పంటైపోయిన తర్వాత భూమిని ఖాళీగా ఉంచకుండా 365 రోజులు వివిధ రకాల పంటలు వేయాలని సూచించారు. దీని వలన భూసారం పెరుగుతుందని, భూమి గుల్ల భారుతుందని, రైతుకు అదనపు ఆదాయం వస్తుందని తెలపారు. ప్రతి మహిళ ఇంటి వద్ద ఖాళీ ప్రదేశం నందు పెరటి తోటలు ప్రకృతి వ్యవసాయ విధానంలో పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులు ఐ కృష్ణారావు, వై శ్రీనివాసరెడ్డి, వి సతీష్, కె నర్సింహారావు, రత్నకుమారి, ధావల్ సాహెబ్‌ను సత్కరించారు.

కారంచేడు : రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గు తాయని పర్చూరు ఎడిఎ ఎన్ మోహనరావు సూచించారు. స్థానిక సచివాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యత, నవధాన్యాల సాగు గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ, వెలుగు, కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రామ సభలో తహశీల్దారు ఎన్ నాగరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఖర్చు తగ్గిద్దామని తెలిపారు. ఎఒ కె సుధీర్ బాబు, ఎన్ఎస్‌ఎ మార్కెటింగ్ అధికారి శ్రీనివాసరావు, కారంచేడు సర్పంచి బి శివపార్వతి, ఎపిఎం మోహనరావు, భవాని, జ్యోతి, లలిత పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ రైతులను సత్కరిస్తున్న అధికారులు


కారంచేడులో మాట్లాడుతున్న పర్చూరు ఎడిఎ


మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున

పంట కొనకుండా ఇబ్బంది పెడుతున్నారు

మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - పర్చూరు

కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి మేరుగ నాగార్జున తీవ్ర విమర్శలు చేశారు. పంట ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా ప్రభుత్వం రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. పొగాకు, శనగ, మిర్చి, మొక్కజొన్న పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని వీరన్నపాలెంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రైతు ఉప్పుటూరి సాంబశివరావు కుటుంబ సభ్యులను ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలను నివారించాలంటే వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల పంట ఉత్పత్తులు కొనుగోలు చేయలని సూచించారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు రైతులు ఎంత పంట పండించారో కనీసం తెలియని పరిస్థితుల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. గుర్తుకు వచ్చినప్పుడల్లా కూటమి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల వద్దకు వెళ్ళి మాట్లాడటమే తప్ప వారికి చేసిందేమి లేదని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసిందని గుర్తు చేశారు. పొగాకు రైతు ఉప్పుటూరి సాంబశివరావు మృతి పట్ల ఆయన తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ ఇంచార్జి గాదె మధుసూదనరెడ్డి, నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, జెట్టి చంద్రం, వైసీపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పఠాన్ కాలేశావళి, కోటా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, మాజీ ఎఎంసీ చైర్మన్ జువా శ్రీనివాసరావు, వై హరి ప్రసాద్, ముప్పాళ్ళ రాఘవయ్య, సన్నీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేటపాలెం ఎఒ ఐ కాశీ విశ్వనాథం

మట్టి నమూనా పరీక్ష చేయించుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం

మట్టి నమూనా సేకరణ జరుగుతుందని, రైతులందరూ మట్టి నమూనాలు తీసుకొని పరీక్ష చేయించుకోవాలని ఎఒ ఐ కాశీ విశ్వనాథం తెలిపారు. మండలంలోని కొత్తపేట రైతు సేవ కేంద్రం నందు రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి డేటా ఎంట్రీ జరుగుతున్నదని తెలిపారు. రైతులు తప్పకుండా ఇందులో నమోదు చేయించుకోవాలని సూచించారు. పిఎం కిసాన్ పథకం, ఫార్మర్ ఎన్రోల్మెంట్‌పై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అనుబంధంతో పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని తెలిపారు. కౌలు రైతులందరూ పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రం కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు. పంట వేసినప్పుడు, అమ్ముకునేటప్పుడు సాగు హక్కు ధ్రువీకరణ పత్రం ఉండాలని సూచించారు. పీఎండిఎస్ కిట్స్ అందుబాటులో ఉన్నాయని, పచ్చి రొట్టె విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్ఎస్‌కెల్లో తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ గోపికృష్ణ, విఆర్ఒ నాగరాజు, విఎఎ శివ నాగ బాబు పాల్గొన్నారు.

గెలిపించి సేవచేసే అవకాశం ఇచ్చారు

మే 13ను ఎప్పటికీ మర్చిపోలేను : కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

తన జీవితంలో మే 13ను ఎప్పటికీ మరిచిపోలేనని, 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు పోలింగ్ ద్వారా విజయాన్ని అందించి ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించారని ఎంఎల్ఎ ఎంఎంఎ కొండయ్య అన్నారు. అందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గతేడాది మే 13న జరిగిన పోలింగ్ తేదిని ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఓటు వేసి అఖండ విజయాన్ని అందించి విలక్షణమైన తీర్పుతో ప్రజాసేవకు ప్రజలు గొప్ప అవకాశం ఇచ్చిన రోజుగా గుర్తుంచుకుంటానని అన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు చూపిన ఆదరణ, ఇచ్చిన విజయం మర్చిపోలేనిదని తెలిపారు. ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు తాను నిత్యం అభివృద్ధిపై కృషి చేస్తున్నానని, ప్రజల కోసమే పనిచేయాలనే ప్రేరణ ప్రతిరోజు ఉంటుందని అన్నారు.


ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య (ఫైల్ ఫోటో)

విరాళాలపై 'రఘుపతి' స్పందనలో అంతర్యమేమిటి?

- విరాళాలు సేకరించిన వాళ్లు లెక్కలు చెప్పేవరకు పోరాటం
- న్యాయవాది విన్నకోట సత్యప్రసాద్ డిమాండ్

ప్రజాశక్తి - బాపట్ల


విన్నకోట సత్య ప్రసాద్

బాపట్ల భావనారాయణ స్వామి దేవాలయం అభివృద్ధికి సేకరించిన విరాళాలకు సంబంధించి తాను అడిగిన వివరాలపై మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి స్పందిస్తారని, స్పందించాల్సిన అవసరం ఆయనకు ఉందని తాను అనుకోలేదని న్యాయవాది విన్నకోట సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలో భీమవారిపాలెం కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయం అభివృద్ధికి సేకరించిన విరాళాల వివరాలపై అడిగితే తనకు సంబంధం లేదని ఈఓ అన్నారని చెప్పారు. కమిటీ వారైనా స్పందిస్తారేమోనని ఈ నెల 9న తాను కోరానని అన్నారు. కోన రఘుపతి హయంలో జరిగిన దానికి ఆయనకు బాధ్యత ఉందని తాను అనుకోలేదని అన్నారు. బ్యాంకు ఖాతా ద్వారానే ఖర్చు పెట్టామని కోన రఘుపతి ఈనెల 10న విలేకర్ల సమావేశంలో చెప్పారని, ఆయన మాట్లాడే క్రమంలో సత్యప్రసాద్ రాజకీయ నాయకుడు కాదని, సదాసీదా వ్యక్తి ఎందుకిలా మాట్లాడారో అర్థం కావడం లేదని అన్నారు. దేవాలయనికి సంబంధించిన ఆర్థిక విరాళాల వివరాలు రాజకీయ నాయకులే ప్రశ్నించాలా? సామాన్య దాతలు ప్రశ్నించకూడదన్న సంగతి తనకైతే తెలియదని అన్నారు. రూ.85వేల విరాళం ఇచ్చిన బాపట్ల పౌరుడిగా విరాళాల వివరాలు అడిగి తెలుసుకోవడం తప్పు కాదని తాను అనుకుంటున్నట్లు తెలిపారు. తాను ఎవరి పేర్లు ప్రస్తావించలేదని, దీనిపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడిన మాటల్లో సత్యప్రసాద్ పట్ల తనకు మంచి అభిప్రాయం ఉందని, తానేదో చెడుపని చేసినట్లు మాట్లాడతారని అనుకోలేదని అన్నారు. రథోత్సవంకు ముందురోజు ఎందుకు రాశారు? ఎవరు మెప్పుకోసం రాశారని మాట్లాడటం ఏమిటని అన్నారు. బాపట్ల పౌరుడిగా, ఒక న్యాయవాదిగా కోన రఘుపతి తోపాటు ప్రస్తుత శాసన సభ్యులు నరేంద్ర వర్మ, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌తో పరిచయాలు ఉన్నట్లు తెలిపారు. అంతమాత్రాన రాజకీయ ముద్ర వేయడం కరెక్ట్ కాదన్నారని అన్నారు. దేవాలయం పునర్నిర్మాణ పనుల్లో భాగంగా దేవస్థానంలో తవ్వకాలు జరిపారని, ఆ సమయంలో వీడియో రికార్డు చేశారో లేదో దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. విరాళాల వసూలు చేసిన దానిపై విరాళాలు ఇచ్చిన దాతలు ఈపాటికే రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయని ఓ అధికారి ద్వారా తనకు తెలిసిందని అన్నారు.

కోలలపూడిలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు


నేత్రదానం చేసిన సుబ్బారావు

మార్టూరు మండలం కోలలపూడి గ్రామానికి చెందిన కందిమల్ల సుబ్బారావు (82) వృద్ధాప్యం రీత్యా, అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కళ్ళను కుటుంబ సభ్యులు మంగళవారం నేత్రదానం చేశారు. గుంటూరు పెదకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి కార్నియా సేకరించారు. నేత్ర దానానికి ఒప్పుకున్న కుటుంబ సభ్యులు భార్య అన్నపూర్ణమ్మ కుమార్తెలు అంజమ్మ, రమాదేవి, అనంతలక్ష్మిని రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు రామ్మోహనరావు, వెంకటేశ్వర్లు, అధ్యక్షులు మొహమ్మద్ రఫీ అభినందించారు.


పరికరాలు అందజేస్తున్న డాక్టర్ సాయి వైష్ణవి

కుష్టు వ్యాధిగ్రస్తులకు పరికరాలు

ప్రజాశక్తి - వేటపాలెం

కుష్టి వ్యాధిగ్రస్తులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ సాయి వైష్ణవి తెలిపారు. ఆమె తన ఆరోగ్య సిబ్బందితో కలిసి మండలంలోని రామన్నపేట-1 సచివాలయ పరిధిలోగల పునీత అంతోని వారి లెప్రసి కాలనీని మంగళవారం సందర్శించారు. కాలనీలో 14 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారని అన్నారు. వారికి అవసరమైన మందులు, వారి కాళ్ల నీళ్లలో నానబెట్టుటకు అవసరమైన చిన్న టబ్బులు, వారి వారి సైజుల ప్రకారం కాళ్లకు ధరించటానికి చెప్పులు, పూర్తిగా నడవడానికి ఇబ్బంది పడు వారికి వాకర్లు, హ్యాండ్ స్టిక్స్ పంపిణీ చేశారు. వారికి ఆరోగ్య విద్య బోధించారు. ప్రభుత్వ సహాయం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లెప్రసీ విభాగం డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ పి సుబ్రహ్మణ్యం, పిహెచ్‌సి సూపర్వైజర్లు జె సుధాకర్, జె మార్తమ్మ, ఆరోగ్య కార్యకర్త పి అరుణ, ఆశా కార్యకర్తలు రజని, చిన్ని పాల్గొన్నారు.

సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



కలెక్టర్ జె వెంకట మురళి

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లో విద్యుత్, డిఆర్డిఎ, సోలార్ కంపెనీ డీలర్లతో ఆయన సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సూర్య ఘర్ యోజన్ పథకం క్రింద ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు. పథకం క్రింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. సోలార్ కంపెనీలు వారికి కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలని చెప్పారు. డిస్కం అధికారులు సోలార్ కంపెనీ ప్రతి నిధులను ఇబ్బంది పెట్టవద్దని చెప్పారు. సోలార్ డీలర్లను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ట్రాన్స్ కో ఎస్ఇ ఆంజనేయులు, సోలార్ కంపెనీ డీలర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైసిపి రైతు అధ్యక్షులు రమణారెడ్డి

పంటలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని కావూరువారిపాలెం పంచాయితీలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఫీల్డ్ వర్క్ లో భాగంగా రైతులను నేరుగా ఇళ్ల వద్ద కలసి పంటలు పండించే విధానంలో ఒక్కో పంటకు ఏ విధంగా ఖర్చవుతుందనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేరుశెనగ, పచ్చిమిర్చి, మినుము పంటల సాగు, పెట్టుబడి, దిగుబడి, ఇతర విషయాలపై రైతులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రొఫెసర్, వైసిపి రైతు విభాగం అధ్యక్షులు కావూరి రమణారెడ్డి పాల్గొన్నారు.



దాణా అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

గోశాలకు దాణా బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ మిత్రుల సౌజన్యంతో విశ్వభారతి రోడ్డులోని హరి హర గోశాలకు 12 బస్తాల దాణా మంగళవారం అందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికార్లు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, శేషారెడ్డి, ధర్మవరపు శ్రావణ్ కుమార్, గుళ్ళపల్లి సుబ్రహ్మణ్యం, గోశాల సుబ్బారావు పాల్గొన్నారు. రోటరీ సౌజన్యంతో ప్రతి నెలా గోశాలకు దాణా ఏర్పాటు చేసి తమ వంతు సహాయం చేస్తున్నామని, సుబ్బారావు గోవులను బాగా పోషిస్తున్నాడని పేర్కొన్నారు.

కౌలు కార్డులతో ప్రయోజనం

ప్రజాశక్తి - ఇంకొల్లు

రైతులతో పాటు కౌలు రైతులు కూడా అన్నదాత సుఖీభవ, ఇతర వ్యవసాయ రాయితీలు పొందాలంటే పంట సాగు పత్రాలు తప్పనిసరిగా పొందాలని ఎఓ వేణుగోపాల్ అన్నారు. ఇంకొల్లు అంబేద్కర్ నగర్లోని రైతు సేవ కేంద్రంలో నిర్వహించిన సాగు పత్రాల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పత్రాలు తీసుకోవాలని చెప్పారు.

పశువుల దాణాతో పాడి రైతుకు ధీమా

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్ర ప్రభుత్వం పశు పోషకులకు 50శాతం రాయితీపై సమీకృత దాణ అందిస్తుందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య పేర్కొన్నారు. రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ 21 టన్నుల పశు దాణాను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాంచారయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 20శాతం ప్రోటీన్ కలిగిన దాణాను అందిస్తుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పశు పోషకులు లబ్ది పొందేందుకు అర్హులని అన్నారు. ఒక్కో కుటుంబానికి రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకు గాను విడతలవారీగా 450 కేజీల పశువుల దాణా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 50కిలోల పరిమాణం కలిగిన దాణా సంచిని రూ.1,100కు కొని రూ.555కే పశు పోషకులకు అందజేస్తారని తెలిపారు. ఈ రాయితీ వల్ల ఆర్థికంగా అదనపు భారం పడుతున్నప్పటికీ వేసవిలో పశుగ్రాసం కొరత అధిగమించి, నిలకడగా పాడి ఉత్పత్తులు పొందేందుకు, పశువుల విక్రయాలు నిలువరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు.



సబ్సిడీపై దాణాను పంపిణీ చేస్తున్న శివప్రసాద్

ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ పాడి పశువుల దాణా ప్రతి పాడి రైతుకు ధీమా అని అన్నారు. ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవడానికి పశు సంవర్ధక శాఖ ద్వారా పశు దాణా, మినీ గోకులాలు 90శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె, బొబ్బర్లంక, కూచినపూడి, గుత్తవారిపాలెం పశువైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ పి మీనాక్షిదేవి, డాక్టర్ హేమ ప్రియా, డాక్టర్ రోషన్ బేగ్, టిడిపి నాయకులు పంతాని మురళీధరరావు, మత్తి భాస్కరరావు, కొలసాని రాము, గోగినేని రామారావు పాల్గొన్నారు.

చిన్నపరిమి గ్రామంలో కిశోర వికాసం



మాట్లాడుతున్న సూపర్వైజర్ నాగరాజకుమారి

ప్రజాశక్తి - వేమూరు

కిశోర బాలికలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు వినియోగించుకోవాలని మోదుకూరు సెక్టార్ సూపర్వైజర్ నాగరాజు కుమారి సూచించారు. చుండూరు మండలం చిన్నపరిమి గ్రామంలో కిశోర్ వికాసం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మోదుకూరు సెక్టార్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ నాగరాజకుమారి బాలికల అవసరతలపై సూచనలు చేశారు. అధిక పోషక విలువలు కలిగిన మునగాకు, ఇతర ఆకుకూరలు తీసుకోవడం ద్వారా రక్తహీనత తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర్ బాలికలు, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

రేపల్లె : బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం ఎంతోగానో దోహదపడుతుందని సిడిపిఓ ఎం సుచిత్ర పేర్కొన్నారు. రేపల్లె సెక్టర్ పరిధిలో కిశోరి వికాసంపై శిక్షణ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరి వికాసం పునాది వేస్తుందని అన్నారు. బాలికల ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్కె జుబేదా, మహిళ సంరక్ష కార్యదర్శి గౌసియా, విఒఎ, ఆషా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లూరు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిశోర వికాసం వేసవి శిక్షణ తరగతులతో బాలికల భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక క్లస్ సెంటర్లోని అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం నిర్వహించారు. కార్యక్రమంలో దోనేపూడి సెక్టర్ సూపర్వైజర్ పజరున్నీసా, అంగన్వాడి కార్యకర్త అరుణ పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు పొందండి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని యనమదల, అనంతవరం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతుల అవగాహన సమావేశాలు మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి మేరిమ్మ మాట్లాడుతూ పంట సాగుదారు హక్కు పత్రాలు రైతులకు జారీ చేయడంపై అవగాహన కల్పించారు. పంట సాగుదారు కార్డుల వల్ల ఉపయోగాలు వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట నష్ట పరిహారాలు పంట సాగుదారు కార్డు ఉన్న కౌలు రైతులకు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిటి విష్ణు, ఎఇఒ మధు ప్రియ, రైతులు తారక రామారావు, సుబ్బారావు, వెంకటరావు, శ్రీను పాల్గొన్నారు.

నగరం : మండలంలో అద్దంకివారిపాలెం, ధూళిపూడి నార్త్ సచివాలయంల పరిధిలో తహశీల్దారు జి నాంచారయ్య అధ్యక్షతన పంట సాగుదారుల హక్కు పత్రాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఎఒ వి రమేష్ బాబు, డిప్యూటీ తహశీల్దారు ఎన్ సత్యనారాయణ, విఆర్ఒలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, అద్దంకివారిపాలెం సర్పంచ్ విచారపు పావని పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని రామకూరు, బైటమంజులూరు రైతు సేవ కేంద్రం పరిధిలో పంట సాగు దారుల హక్కు పత్రాలపై అవగాహనను వ్యవసాయ, రెవిన్యూ శాఖలు సంయుక్తంగా మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు పి సింగారావు సాగు



కార్డు అందజేస్తున్న నగరం తహశీల్దారు జి నాంచారయ్య

హక్కు పత్రాల వలన రైతుకు చేకూరనున్న లాభాలు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్ట పరిహారం, వ్యవసాయ రుణాలు తదితర ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఎఒ డి సుబ్బారెడ్డి, ఆర్ఐ శ్వేత పాల్గొన్నారు.

భట్టిప్రోలు : రానున్న ఖరీఫ్ సీజన్లో కౌలు రైతులు ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలు పొందేందుకు గుర్తింపు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎఒ లక్ష్మీపసన్న సూచించారు. భట్టిప్రోలు రైతు సేవ కేంద్రంలో మంగళవారం రైతులు, కౌలు రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు 50శాతం రాయితీతో పచ్చి రొట్ట విత్తనాలు అందజేయడం జరుగుతుందని, అవసరమైన రైతులు తీసుకుని వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం రైతులకు 50శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో విఆర్ఓ కాశీ కృష్ణ, వివిఎలు మైత్రేయి, రత్నరాజు, నాయకులు సాయిబాబా పాల్గొన్నారు.



పాఠశాల సంసిద్ధత మేళాలో ఐసిడిఎస్ సిడిపిఓ ట్యూన్సీ

పిల్లల అభివృద్ధిని పరిశీలించాలి


ప్రజాశక్తి - చీరాల

పిల్లల అభివృద్ధిని తల్లిదండ్రులు స్వయంగా పరిశీలించాలని ఐసిడిఎస్ సిడిపిఓ టి ట్యూన్సీ అన్నారు. ఐటిసి బంగారు భవిష్యత్, ప్రథమ్ సహకారంతో పట్టణంలోని సీ సెక్టార్ పరిధిలోని తూర్పు కాపుల వీధిలో వేటపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత మేళా మంగళవారం నిర్వహించారు. సిడిపిఓ టి ట్యూన్సీ మేళాను ప్రారంభించారు. పిల్లల అభివృద్ధి స్థాయిని తల్లిదండ్రులు స్వయంగా పరిశీలించి వేసవి సెలవుల్లో ఇంట్లో అందుబాటులో ఉండే వస్తువులతో అభ్యసనం చేసే విధానాన్ని వివరించారు. పిల్లల ఆసక్తిని బట్టి ప్రోత్సహించడం వలన వారిలో ఉత్సాహం, ఉల్లాసం, జిజ్ఞాస పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కవిత, ప్రథమ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ పి త్రివేణి పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని 21 గ్రామాల్లో కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు అవగాహన ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దారు సింగారావు తెలిపారు. గతేడాది మండలంలో 2200 మంది కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చామని, ఈ ఏడాది 2500 మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు. ఇందుకుగాను ఆయా గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న రామకూరు, బైట మంజులూరు, 14న కొండ మంజులూరు, 15న ముప్పవరం, కొండమూరు, 16న కోటపాడు, బూదవాడ, 17న పంగులూరు, చందలూరు, 19న రేణింగవరం, కశ్యాపురం, 20న అలవలపాడు, తూర్పు తక్కెలపాడు, 21న తూర్పు కొప్పెరపాడు, నూజిల్లపల్లి గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌలు రైతులు ఉపయోగించుకొని కౌలు గుర్తింపు కార్డులు పొందాలని కోరారు.



రోడ్డు మార్జిన్ను ఆక్రమించి అక్రమ కట్టడం

రోడ్డు మార్జిన్ ఆక్రమణ

ప్రజాశక్తి - వేటపాలెం

సిమెంటు రోడ్డు మార్జిన్ను ఆక్రమించి అక్రమ కట్టడం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. సిమెంట్ రోడ్డు వెంట ఉండే మార్జిన్ సైతం వదల కుండా సిమెంటు రోడ్డు అంచులోపలకు గాడి తవ్వి మరి పిల్లర్ దిమ్మ వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలోని వేటపాలెం పంచాయతీ పట్టణ నడిబొడ్డున జరుగుతుంది. వేటపాలెం నుండి చీరాల వెళ్లే వన్వే రోడ్డు నుండి వెంకటేశ్వర స్వామి గుడికి కూతవేటు దూరం నుండి బాణాల లొంపలోకి వెళ్లే పంచాయతీ రోడ్డు అంచు దుస్థితి ఇది చిత్రంలో కనిపిస్తున్న దృశ్యాన్ని పరిశీలిస్తే సిమెంటు రోడ్డు అంచు భాగం వరకు తొలచి పిల్లర్ వేయటానికి సిద్ధం చేశారు. ఈ సంఘటనపై స్థానికులు పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని విమర్శిస్తున్నారు. పంచాయితీ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉన్నప్పటికీ స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు కలుగజేసుకొని అక్రమ కట్టడం పట్ల స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

15న అమ్మనబ్రోలుకు మంత్రి నారా లోకేష్ రాక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర మానవ వనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన శాఖ మంత్రి నారా లోషే ఈనెల 15న నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి రానున్నారు. ఉదయం 8 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లి స్వగృహం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 8.45 గంటలకు నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో బయలుదేరి 9 గంటలకు అమ్మనబ్రోలు గ్రామానికి చేరు కుంటారు. ఇటీవల దారుణ హత్యకు గురైన మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను లోకేష్ పరామర్శిస్తారు. ఉదయం 10.30 గంటలకు అమ్మనబ్రోలు గ్రామం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి చదలవాడ హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 11 గంటలకు చదలవాడ హెలీప్యాడ్ నుంచి అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లెకు బయలుదేరుతారు.



బీమా చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

రూ.5లక్షల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - టంగుటూరు

కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేశ్ అండగా నిలుస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొండపి నియోజకవర్గం కామేపల్లి అగ్రహారానికి చెందిన టిడిపి కార్యకర్త తానికొండ వెంకటరావు కుటుంబ సభ్యులకు తూర్పునాయుడు పాలెంలోని తన క్యాంపు కార్యాల యంలో రూ.5 లక్షల బీమా చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా మన రాష్ట్రంలో టిడిపి కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్షేమ నిధి ద్వారా కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు వారి పిల్లలకు విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి వెంకట్రావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఒల ఆందోళన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్ఒ)లు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు మండగిరి రాజేష్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా వేతనాల కోసం ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ప్రకారం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. నిబంధనలు పక్కాగా ఉన్నప్పటికీ అమలు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ను, 23శాతం జీతం పెంపుదల, క్లినిక్‌ల అద్దె బకాయిలు, క్లినిక్ లలో పారిశు ధ్యం కోసం, కంటిన్జెంట్ వర్కర్‌ను నియమించాలని డిమాండ్ చేసారు. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వం ప్రత్యేక దష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్. జీవనజ్యోతి, జిల్లా సెక్రెటరీ ప్రసన్న, రమేష్, దీప్తి ,కామేష్,రామాంజనేయులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : జేసీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చే అర్జీల పై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) మంగళవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడి సమస్యకు తగిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. రీ ఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పార్థసారధి, వరకుమార్, కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

డిఎస్‌సి అభ్యర్థులకు

వయోపరిమితి పెంచాలని జేసీకి వినతి

ప్రజాశక్తి,-ఒంగోలు సిటీ

డిఎస్‌సి అభ్యర్థులకు వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచి నిరుద్యోగులకు ప్రభుత్వం బాసటగా నిలవాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఎస్‌సి అభ్యర్థులు జేసీ గోపాలకష్ణను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు మాట్లాడుతూ ఏడు సంవత్సరాల తర్వాత విడుదలైన నోటిఫికేషన్‌కు సన్నద్ధం అవ్వడానికి, పరీక్షకు కనీసం 90 రోజుల సమయం లేకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అభ్యర్థుల వయోపరిమితి 44 ఏళ్లు ప్రకటించడం వల్ల కొందరు అర్హత కోల్పోయినట్లు తెలిపారు. గత డిఎస్‌సిలో 1,2 మార్కులు తేడాతో ఉద్యోగ అవకాశం కోల్పోయినవారు, డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న వారిలో 44 ఏళ్ళు పై బడిన వందలాది మంది ఉన్నారని తెలిపారు. వారిని దష్టిలో పెట్టుకుని వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని కోరారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి అభ్యర్థుల వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచిందని, మన రాష్ట్రంలో వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని కోరారు. నార్మలైజేషన్ రద్దుచేసి జిల్లాకు ఒకే పేపర్ పద్ధతి లో పరీక్షలు నిర్వహించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో డివైఎఫ్ఐ నగరకార్యదర్శి వై.దానియేలు ,మన్నం వెంకటరావు, సురేంద్ర , వెంకట్, డిఎస్‌సి అభ్యర్థులు ఉన్నారు.



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉపాధి కూలీలకు బకాయిలు పరిహారంతో చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. రాష్ట్ర సమితి పిలుపుమేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకష్ణకు సంఘ నేతలు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గత మార్చి 25 నుంచి ఇప్పటి వరకూ రావాల్సిన రావలసిన ఉపాధి కూలీల బకాయిలు పరిహారంతో చెల్లించాలన్నారు. వేతనాలు రాక పోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కూలీలకు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు.ఫస్ట్ ఎయిడ్ బాక్స్ , తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సయ్యద్ మౌలాలి, రాష్ట్ర అఫీస్ బేరర్ ఎం.విజయ ,జిల్లా కార్యదర్శులు జిపి.రామారావు, గద్దల రవి పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ నాయకులు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ కుంభా రాఘవయ్య మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. 20న తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు. జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ అఖిల భారత ఉద్యోగుల సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్యల పిలుపు మేరకు ఈనెల 20 నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొనాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్మికులకు చేటు తెచ్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ 26,000 అమలు చేయాలని. కాంట్రాక్ట్ అవుట్ సోర్స్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సహకార రంగసంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించు కోవాలన్నారు. ఇపిఎఫ్ కనీస పెన్షన్ రూ.9000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల ఉద్యోగులకు నిర్దేశించిన జీవో నెంబర్ 36 ను సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. సహకార సంఘాల ఉద్యోగులకు చట్ట ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత ఉద్యోగాల్లో నియమితులైన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 20న సమ్మె చేపట్టనున్నట్లు వారు ప్రకటించారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు



క్రీడా సామగ్రి అందజేస్తున్న జేసీ గోపాల కృష్ణ

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

క్రీడాకారులలో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఉద్దేశించిన వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రకాశం జిల్లాలోని అర్బన్, రూరల్, జిల్లా కేంద్రంలో 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించేందుకు అవకాశం కల్పించింది. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులకు సంబంధించిన క్రీడాకారులు, స్పోర్ట్స్ మెటీరియల్స్ డేటాను క్రీడా యాప్ ద్వారా ఆన్‌లైన్ చేశారు. సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్న ఒంగోలు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఓరియెంటెడ్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సురేష్, యర్రగొండపాలెం అథ్లెటిక్స్ కోచ్ రాజు నాయక్, కనిగిరి బాల్‌బ్యాడ్మింటన్ వ్యాయామ ఉపాధ్యాయుడు బసవయ్య, మార్కాపురం బాక్సింగ్ సీనియర్ ప్లేయర్ రామకష్ణ, సిలంబం సీనియర్ ప్లేయర్ శ్రీనివాసులు, ఫుట్ బాల్ సీనియర్ ప్లేయర్ యు.రామకష్ణ, జమ్ములపాలెం వెయిట్ లిఫ్టింగ్ సీనియర్ ప్లేయర్ అభిషేక్, వాలీబాల్ పీడీ అశోక్, ఒంగోల్ వెయిట్ లిఫ్టింగ్ పిఇటి హెప్సిబాలకు క్రీడా సామగ్రిని జేసీ ఆర్.గోపాలకృష్ణ, డిఆర్ఒ బి.చిన ఓబులేసు అందజేశారు. మిగిలిన సమ్మర్ కోచింగ్ క్యాంపులకు మెటీరియల్‌ను అందజేస్తామని తెలియ జేశారు. ఈ కార్యక్ర మంలో ప్రకాశం జిల్లా క్రీడాభివద్ధి అధికారి జి. రాజరాజేశ్వరి, ఆయా అసోసియేషన్ల కార్యదర్శులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్

20న రవాణా రంగ కార్మికుల 'టైర్ బంద్'

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఈనెల 20న టైర్ బంద్‌ను జయప్రదం చేయాలని ఎపి ఆటో అండ్ ట్రాలీవర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎపి ఆటో అండ్ టాలీ వర్కర్స్ యూనియన్ ఒంగోలు నగర విస్తృత సమావేశం మంగళవారం నిర్వహించారు. యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఉద్యోగులు కార్మికులు, ప్రజలపై భారాలు మోపుతూ. కార్మిక వర్గానికి తూట్లు పొడిచే కార్మిక చట్టాల స్థానం లో లేబర్ కోడ్‌లు అమలు చేసేందుకు ప్రయత్నిసుందని తెలిపారు. ఈ విధానాల వల్ల రవాణా రంగం కార్మికులు రోడ్లపై వాహనాలు నడిపే పరిస్థితి ఉండదన్నారు. రవాణా రంగ కార్మికులకు ఉరితాడు మారిన ఎంయు చట్టాన్ని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 21 ప్రకారం ఆటో రవాణా కార్మికులకు అధిక పెనాల్టీల విధానాన్ని రద్దు చేయాలన్నారు. రవాణా రంగం కార్మికులకు వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసి, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని కోరారు. యూనియన్ ఒంగోలు నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఆటో కార్మికులకు పర్మినెంట్ ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో కార్మికులపై అధికారులు వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర ఉపాధ్యక్షులు జి. తిరుమలయ్య,అంగరేకుల కోటేశ్వరరావు, రామిరెడ్డి, గాంధీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.